సాక్షి నంద్యాల
గురువారం । 23 । మే । 2024



వీరభద్రుడికి విశేష అర్చనలు

శ్రీశైలం: స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి బుధవారం లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ విశేష అర్చనలు చేశారు. క్షీరాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు.



సీమ సిగలో 'విద్యుత్' తేజం

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యాలయం రాయలసీమలోని కర్నూలుకు వచ్చేసింది. జూన్ 2 నుంచి సేవలు అందించనుంది. 8లో▸



చక్రధారి.. కోనేటి వైభవం!

అహోబిలేశుని జయంతి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఎగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులకు తీర్థవారి చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

వైభవంగా స్వాతి వేడుకలు



శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహ స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, చైర్మన్

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వైశాఖ శుద్ధచతుర్దశిని పురస్కరించుకుని స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి.. శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవలు, ప్రత్యేక పూజలు, విశ్వక్సేనారాధన, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశ స్నపనం, నరసింహ హోమం, పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం నిర్వహించారు. అనంతరం అలంకార ప్రియుడైన స్వామి వారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రత్యేక పుష్పాలంకరణలో ఉంచి, నైవేద్యాలు సమర్పించి మహా మంగళ హారతి గావించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మన్ నాయుడు, ఆకుల రమణ, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు




కేంద్ర సాయిధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల వేళ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా మొత్తం 30 యాక్ట్ అమల్లో ఉందన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు వారి అనుచరులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు జరుపుకునేందుకు అనుమతులు లేవన్నారు. కార్యక్రమంలో సీఐలు రమేష్ బాబు, హనుమంతు నాయక్, ఎస్‌ఐలు నరసింహ, నగీన, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందన నీరు కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఫ్రైడే డ్రైడేగా నిర్వహిస్తూ, డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వెక్టార్ కంట్రోల్ యాప్ ద్వారా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య అధికారుల సమన్వయంతో శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంట్లోని కూలర్లు, పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను ఏఎన్ఎం లాగిన్లో పరిష్కరించాలన్నారు. అనారోగ్య లక్షణాలున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో ఏఎంఓ వరప్రసాద్‌రెడ్డి, రామవిజయారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఏఆర్టీ సెంటర్లో సీడీ4 కౌంట్ పరికరం ఏర్పాటు

స్థానిక ఏఆర్టీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎయిడ్స్ వ్యాధి తీవ్రతను గుర్తించే అత్యాధునిక సీడీ4 కౌంట్ పరికరాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ప్రారంభించారు. రూ.10 లక్షల విలువైన సీడీ4 కౌంట్ పరికరం ఏర్పాటుతో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల శాంపిళ్లను కర్నూలుకు పంపాల్సిన అవసరం లేదని డీఎం అండ్ హెచ్‌ఓ అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ ప్రసాదరావు, జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శారదాబాయి, డాక్టర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

'దివ్య'మైన భవిత

- జిల్లాలో ఇంటింటికి భవిత కేంద్రాల ఈఐఆర్‌పీలు
- జూన్ నెల 9వ తేదీ వరకు నిర్వహించనున్న సర్వే
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి
- ఇప్పటి వరకు 209 మంది గుర్తింపు
- జిల్లాలో 58 మంది ఐఈఆర్‌పీలతో సర్వే
- 29 మండలాల్లో భవిత కేంద్రాలు

దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలలో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన 18 ఏళ్లలోపు వారి వివరాలను సేకరిస్తున్నారు. చదువు వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేతో ఇప్పటికే కొందరు బడుల్లో చేర్చేందుకు ముందుకు వచ్చారు. – గోస్పాడు

సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేసి అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వీటిపై అవగాహన లేక ఇప్పటికీ అనేక మంది తల్లిదండ్రులు వీటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వైకల్యంతో పుట్టిన తమ పిల్లల భవితవ్యం ఇంతేనంటూ ఊరకుండిపోతున్నారు. దీని వల్ల ఆ పిల్లల్లో వైకల్యానికి తోడు విద్యాబుద్ధులు లోపించి ఇళ్లలోనే ఉండిపోవాల్సి వస్తుందోనని ఆవేదన చెందేవారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు సహిత విద్య అధికారులు ఇంటింటి సర్వేను చేపట్టారు. మే 1న ప్రారంభమైన ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు కొనసాగుతుంది. పాఠశాలలు తెరిచే నాటికి చిన్నారులను గుర్తించిన బడుల్లో చేర్పేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు

ప్రత్యేక అవసరాల పిల్లలను బడుల్లో చేర్పించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. చదువుకునే దివ్యాంగులకు కావాల్సిన అన్ని ఉపకరణాలు ఉచితంగా మంజూరవుతున్నాయి. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 29 భవిత కేంద్రాలు ఉండగా వాటిలో 58 మంది సహిత విద్యా ఉపాధ్యాయులు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. గత ఏడాది వరకు పుట్టినప్పటి నుంచి 18 ఏళ్లలోపు అన్ని రకాల వికలాంగత్వం కలిగిన వారు 4,763 మంది ఉన్నారు. వీరిలో ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ కింద 548 మంది చెవిటి, మూగ, బుద్ధి మాంద్యం కలిగిన వికలాంగత్వం వారికి నెలకు రూ.300 చొప్పున, ఎస్కార్ట్ అలవెన్స్ కింద 287 మంది, అంధులు, నరాల బలహీనత లోపం, శారీరక వికలాంగులు, బహుళ వైకల్యం ఉన్న పిల్లలకు నెలకు రూ.300 చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. అలాగే ఇంటి వద్దనే విద్యను అభ్యసిస్తున్న 169 మంది అన్ని రకాల దివ్యాంగత్వం కలిగిన వారికి రూ.300 చొప్పున, బాలికలకు అలవెన్స్ కింద 1,238 మందికి నెలకు రూ.200 చొప్పున అన్ని రకాల వికలాంగత్వం ఉన్న వారికి ఇప్పటి వరకు ప్రభుత్వం అలవెన్స్‌లను అందజేస్తుంది. అయితే ప్రస్తుతం మే 1 నుంచి నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటి వరకు 209 మందిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లు అందజేస్తారు. బాగా రాణించే వారికి ఉన్నత విద్య, ఉపాధికి అవకాశాలు ఉన్నాయి. వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువపత్రంతో పింఛను లభిస్తుంది. బస్సులు, రైలులో ప్రయాణానికి పాసు సదుపాయం వర్తిస్తుంది. పాఠశాలకు రాలేని వారి ఇళ్లకే ఉపాధ్యాయులు వచ్చి అవసరమైన బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలలకు వచ్చినట్లే హాజరు నమోదవుతుంది.



ముత్తలూరులో నిర్వహిస్తున్న భవిత సర్వే



బాబానగర్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది



బ్రాహ్మణకొట్కూరులో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నాం



జిల్లాలో 29 మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడంలో ఐఈఆర్పీలు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు 209మందిని గుర్తించాం. ఇటీవల నిర్వహించిన క్యాంపులలో బడి ఈడు పిల్లలు కూడా ఉన్నారు. వారంతా బడికి వచ్చే అవకాశాలున్నా వారిని చైతన్య పరిచి భవిత కేంద్రాలకు రప్పించి అక్కడ విద్యాబుద్ధులు నేర్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

– రఘురామిరెడ్డి, సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్, నంద్యాల

సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలన్నీ సద్వినియోగం చేసుకోవాలి. జూన్ నెల 9 వరకు భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులతో ఇంటింటి సర్వే కొనసాగుతుంది. మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరేళ్ల వారిని పాఠశాలల్లో చేర్పించనున్నాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 24వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని డీవీఈఓ సునీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 9,350 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 4,398 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వీరికి 31 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

వచ్చేనెల 1 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జూన్ 1 నుంచి ప్రారంభం అవుతాయని డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. హాల్‌టికెట్లను https://apopenschool.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని వివరించారు.

మహానందిలో తగ్గని భక్తుల రద్దీ



కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో భక్తజన సందడి కొనసాగుతూనే ఉంది. బుధవారం వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా దర్శనం కొనసాగింది. రాత్రి 9.30 గంటలకు జరిగిన ఏకాంతసేవ పూజలతో దర్శనం ముగిసింది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

బనగానపల్లె రూరల్: యాజమాన్యాల ఒత్తిడితో ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు ఇంటింటికి తిరిగి పిల్లలను చేర్పించాలని కోరడం చూశా.. కానీ బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం బాలయ్య, కృష్ణుడు, వై మురళీమోహన్, కె వీరన్న, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ కళాశాలలో చేర్పించాలని కోరుతున్నారు. కళాశాలలో ఉన్న గ్రూప్‌లు, వసతులు, ఇంటర్‌లో సాధించిన ఫలితాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్చాలని కోరుతుండటం చూసి పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని వసతులు ఉండడంతో పాటు నైపుణ్యం, అనుభవం కలిగిన అధ్యాపకులం ఉన్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తే బాగా చదువు చెబుతామని అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ మాట్లాడుతూ ఏటా తరగతులు ప్రారంభమైన తర్వాత విద్యార్థులు చేరే వారని, ఈ ఏడాది తమ అధ్యాపకుల ప్రచారం వల్ల ఇప్పటికే పది మంది అడ్మిషన్ తీసుకున్నారని, మరో 40 మంది దరఖాస్తు ఫారాలు తీసుకెళ్లారని తెలిపారు.



విద్యార్థినిని కళాశాలలో చేర్పించాలని కోరుతున్న ప్రభుత్వ కళాశాల అధ్యాపక బృందం

నేడు శ్రీశైలంలో గిరి ప్రదక్షిణ

శ్రీశైలం: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలో గురువారం ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి గిరి ప్రదక్షిణ చేస్తారు. అంకాలమ్మ గుడి, నంది మండలం, బయలు వీరభద్ర స్వామి ఆలయం మీదుగా సారంగధర మఠం, వేమారెడ్డి మల్లమ్మ మందిరం, మహిషాసుర మర్దిని ఆలయం, రుద్రవనం, నంది మండపం వరకు గిరి ప్రదర్శన కొనసాగుతుంది. తిరిగి ఆలయ ప్రాంగణం చేరుస్తారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వచ్చే నెల 4న తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. అరగంట తర్వాత ఈవీఎంల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుందన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లు ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో భాగంగా మూడు టేబుల్‌లను సర్వీస్ ఓటర్లకు ప్రత్యేకంగా కేటాయిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల పాసుల జారీకి ఈనెల 27లోగా దరఖాస్తు(ఫామ్–18)చేసుకోవాలన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు మొబైల్ ఫోన్లను కౌంటింగ్ హాల్‌లోకి తీసుకురాకూడదన్నారు. జూన్ 1 నుంచి 10వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. సమావేశంలో డీఆర్ఓ పద్మజ పాల్గొన్నారు.

- జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పర్మిట్ లేని ఇసుక రవాణా ట్రాక్టర్లను సీజ్ చేయాలన్నారు. రాత్రి వేళల్లో నంద్యాల సమీపంలోని కుందూ నదిలో అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నిఘా తీవ్రతరం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి రామచంద్ర, ఉప రవాణా శాఖ అధికారి శివారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు రఘురాం, ఎన్ ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.
- టెన్త్, ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3 వరకు, ఇంటర్ పరీక్షలు ఈనెల 24 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఉంటాయన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ మిషన్లను మూసి వేయించాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ పద్మజ, మునిసిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డీవీఈఓ సునీత, డీఈఓ సుధాకర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఏపీఎస్ఆర్టీసీ, ఏపీఎస్పీడీసీఎల్, కార్మిక శాఖ, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



రాజకీయ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

ఊరూరా ఉపాధి

- ఈ ఏడాది లక్ష్యం 76.77 లక్షల పనిదినాలు
- ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరం
- రూ.329 కోట్ల లేబర్ బడ్జెట్ కేటాయింపు
- జిల్లాలో 4.49 లక్షల జాబ్ కార్డులు
- కూలీలకు గరిష్ట వేతనం రూ.300

వలస వెళ్లకుండా ఉన్న ఊళ్లోనే ప్రభుత్వం ఉపాధి కల్పిస్తోంది. కొలతల ప్రకారం పని చేయించి గిట్టుబాటు వేతనం ఇస్తోంది. ఈ ఏడాదికి 76.77 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించుకుని రూ.329 కోట్ల లేబర్ బడ్జెట్ కేటాయించింది. లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు కూడా ముమ్మర చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా దాదాపు 40 రకాల పనులు గుర్తించారు.

కోవెలకుంట్ల: జిల్లాలో 4.49 లక్షల జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 8.70 లక్షల మంది కూలీలు ఉన్నారు. 1.56 లక్షల కుటుంబాల్లోని 2.71 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాగా ఈ ఏడాది జిల్లాలో 76.77 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం రూ.329 కోట్ల లేబర్(కూలీల వేతనం, మెటీరియల్ కలిపి)బడ్జెట్ కేటాయించారు. ఈ నిధులు వ్యవసాయ పొలాలకు రహదారులు, కేసీ, ఎస్సార్బీసీ, కుంటలు, చెరువులు, బావుల్లో పూడికతీత, కొత్తగా పంట కాల్వలు, కొండ ప్రాంతాల్లో నీరు నిల్వ చేసే పనులు, ముళ్ల పొదల తొలగింపు, ఉద్యానవన శాఖ పరిధిలో మామిడి, నిమ్మ, సపోట, జామ తదితర పండ్ల తోటల పెంపకం పనులకు ఖర్చు చేయనున్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు..

వేసవికాలం కావడంతో పలు గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో మే నెలాఖరు నాటికి 32.51 లక్షల పనిదినాలు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 32.47 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. పనుల గుర్తింపు నుంచి డబ్బు చెల్లింపు వరకు ప్రత్యేక యాప్‌ల్లో వివరాలు నమోదు చేసేలా విధి విధానాలు రూపొందించారు. ఉపాధి పథకంలో ఒకేసారి అన్ని రకాల పనులు చేయకుండా గుర్తించిన పనుల్లో 20 పనులు మాత్రమే చేసేలా యాప్‌లో నిబంధన విధించారు. ఈ పనులు కాకుండా మరో పని ఎంచుకుంటే 20 పనుల్లో ఒక పనిని ఆన్‌లైన్‌లో తొలగించి కొత్తగా ఎంపిక చేసిన పనిని నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఉపాధి పథకంలో ఎలాంటి అవకతవకలు, బినామీ మస్టర్లకు తావు లేకుండా హాజరు విధానాన్ని పకడ్బందీగా రూపొందించారు. మస్టర్‌లో అటెండెన్స్ వేసిన వెంటనే సెల్‌లో ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశంలో కూలీ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. పని ప్రారంభమయ్యాక నాలుగు గంటల తర్వాత అదే కూలీని మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ విధానంతో అక్రమాలకు చెక్ పడినట్లయింది. ఈ ఏడాది నుంచి కూలీలకు రోజుకు రూ.300 గరిష్ట వేతనం కాగా ఆయా మండలాల్లో రోజుకు రూ.260 సగటు వేతనం అందుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో 15 వేల కుటుంబాలు వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. ఈ ఏడాది 20 వేలకు పైగా వంద పనిదినాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



కోవెలకుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇప్పటి వరకు క్లస్టర్ల వారీగా కల్పించిన పనుల వివరాలు

క్లస్టర్	పనిదినాలు
కోవెలకుంట్ల	7.42 లక్షలు
నంద్యాల	9.06 లక్షలు
ఆత్మకూరు	8.44 లక్షలు
డోన్	7.45 లక్షలు

ఉపాధి పనులకు వెళ్తున్నాం



నా భర్త, నేను ఇద్దరం ఉపాధి పనులకు వెళ్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 30 రోజులు పని చేశాం. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించడం మాలాంటి వారికి ఎంతో ఉపయోగం. ప్రస్తుతం పంట కాల్వలు, చెక్‌డ్యాంల్లో పూడికతీత పనులకు వెళ్తున్నాం.

– మౌనిక, ఉపాధి కూలీ, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

రోజుకు కూలి రూ.300 పడుతుంది



ఉపాధి పనికి వెళ్తే గత ఏడాది రోజుకు రూ.272 కూలి పడేది. ఇప్పుడు రోజుకు రూ.300 పడుతుంది. వ్యవసాయ పనులతోపాటు ఉపాధి పనులు అందుబాటులో ఉండటంతో మాలాంటి వారికి ఏడాది పొడవునా చేతి నిండా పని దొరుకుతుంది.

– రాజు, కలుగొట్ల, కోవెలకుంట్ల మండలం

స్టాక్ పాయింట్‌కు చేరిన నోట్ పుస్తకాలు



కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కాక ముందే విద్యార్థులకు నోట్ పుస్తకాలు వచ్చాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి 24,884 నోట్ పుస్తకాలను కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు. రెండు, మూడు రోజుల్లో 16,467 పాఠ్య పుస్తకాలు మండలానికి రానున్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. నోట్, పాఠ్య పుస్తకాలను స్టాక్ పాయింట్ నుంచి నేరుగా ఆయా పాఠశాలలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

డెంగీ కేసులపై ఆరా


కరివేములలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామంలో గతంలో వచ్చిన డెంగీ కేసులపై రాష్ట్ర కన్సల్టెంట్స్ పరీలకులు కొండారెడ్డి రామచంద్ర, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర చంద్రశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర సాయిబాబా బుధవారం ఆరా తీశారు. గ్రామంలో దోమల లార్వా ఎక్కడైనా ఉందేమో అని పరిశీలించారు. వైద్యసిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. జ్వరం కేసులు ఉంటే రక్తపూత నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ రంగస్వామి, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది


గ్రిల్‌లో ఇరుక్కుపోయిన మహిళను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

ఆదోని అర్బన్: డ్రైనేజీ గ్రిల్‌లో ఇరుక్కుపోయిన మహిళను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. గత రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీలు నిండిపోయాయి. కౌతాళం గ్రామానికి చెందిన సుశీల బంధువులు బెంగళూరుకు వలస వెళ్లేందుకు మంగళవారం రాత్రి ఆదోని రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నారు. స్థానిక పాత ఓవర్ బ్రిడ్జి కింద రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో రోడ్డు మధ్యలో డ్రెయినేజీ ఉంది. నీరు నిల్వ ఉండడంతో రాత్రి కనిపించక సుశీల కాలు డ్రెయినేజీలో గ్రిల్‌లో ఇరుక్కుపోయింది. బయటికి తీసేందుకు వీలుకాకపోవడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఇనుప గ్రిల్‌ను జేసీబీతో తొలగించి మహిళను రక్షించారు. అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం నలుగురు డిబార్ అయ్యారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 2,426 మందికి 2,178 మంది, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 8,153 మందికి 7,494 మంది విద్యార్థులు హాజరయ్యారని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నందికొట్కూరు సాయిరాం డిగ్రీ కళాశాలలో 3, నంద్యాల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఆదోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆస్పరి రహదారిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి జూన్ 3వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, 31 నుంచి జూన్ 5వ తేదీ వరకు విద్యార్థులు కళాశాలను ఎంపిక చేసుకునేందుకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకొనవచ్చునని వివరించారు. జూన్ 5వ తేదీన వెబ్ ఆప్షన్స్ మార్చుకునేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. 7న సీట్లు కేటాయింపు, 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆయా కళాశాలలో ప్రవేశాలు జరుగుతాయని వివరించారు. జూన్ 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఏమైనా సందేహాలుంటే 79016 20203 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చక్రధారి.. కోనేటి వైభవం!

- ఎగువ అహోబిలంలో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం
- దిగువలో కనుల పండువగా కలశ తిరుమంజనం


ప్రాయశ్చిత్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు


చక్రస్నానంను తిలకిస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ: అహోబిల జయంతి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఎగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులకు తీర్థవారి చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వాములను ప్రత్యేకంగా అలంకరించి భవనాసి గుండం వరకు తోడ్కొని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వస్త్రాలు మార్చి వేద పండితులు, అర్చకులు.. స్వామి అమ్మవార్ల ఎదుట సుదర్శనమూర్తి, నిత్య అభిషేకమూర్తులకు కలిపి పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. సుదర్శనమూర్తికి, నిత్య అభిషేక ఉత్సవమూర్తికి కోనేరులో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం చేయించారు. ఉత్సవ మూర్తులతో పాటు, అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది,భక్తాదులు శాస్త్రోక్తంగా తీర్థవారి చక్ర స్నానాలు ఆచరించారు. అనంతరం ప్రాయశ్చిత్య హోమం నిర్వహించారు.

దిగువలో ..

దిగువ అహోబిలంలో కలశ తిరుమంజనంలో భాగంగా ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం 108 కళశాలతో తిరుమంజనం నిర్వహించి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.


ఎగువ అహోబిలంలో స్వామికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

మహానందిలో 30న హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో ఈ నెల 30న హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఈఓ విలేకరులతో మాట్లాడుతూ శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయక నంది ఆలయాల్లోని హుండీ కానుకలు లెక్కిస్తామన్నారు. వీటితో పాటు అన్నప్రసాదం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీ కానుకల లెక్కింపు చేపడతామన్నారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే లెక్కింపు కార్యక్రమానికి సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ (21) బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. నాగరాజు, మహేశ్వరిల కుమారుడు వెంకటరమణ బుధవారం సొంత పొలంలో విత్తనం వేస్తుండగా ప్రమాదవశాత్తూ వ్యవసాయ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ప్రతిభ ఉంటే.. ఉపకారం మీ వెంటే

- విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్ షిప్
- జూన్ 7 వరకు దరఖాస్తుకు గడువు

Vidyadhan
Transforming lives through education
A Shibulal Family Philanthropic Initiative

నంద్యాల (న్యూటౌన్): చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజినీ దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలవుతోంది. ఇప్పటి వరకు ఈ పథకం కింద 6,500 మందికి పైగా ఆర్థిక సాయం, 27,600 మంది వరకు స్కాలర్‌సిప్‌లు అందజేశారు. ఎంపికైన విద్యార్థులు రెండేళ్ల పాటు ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. విద్యార్థి చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకు ఉపకార వేతనం అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఈ ప్రోగ్రాం ద్వారా భవిష్యత్‌కు అవసరమైన దిశానిర్దేశం చేస్తారు.

విద్యార్థుల అర్హతలు

సరోజినీ దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం పొందాలంటే విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2 లక్షలలోపు ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియెట్ చదువుతున్న వారై ఉండాలి. పదిలో కనీసం 90 శాతం మార్కులు సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక విధానం

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. జూన్ 23న దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 20 నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

జూన్ 7వ తేదీ వరకు గడువు

విద్యాదాన్ ఉపకార వేతనం కోసం జూన్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, చదువుతున్న కళాశాల వివరాలను పొందుపర్చాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగతంగా ఇతరుల ఈ మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. అందుకే సొంత ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకుని, దాని పాస్‌వర్డ్ గుర్తుంచుకోవాలి. మరిన్ని వివరాల కోసం విద్యాదాన్ ఆంధ్రః ఎస్‌డీ ఫౌండేషన్ ఇండియా.కామ్ సంప్రదించాలి. లేదా 96635 17131 నంబర్‌లో సంప్రదించవచ్చు.

సీమ సిగలో 'విద్యుత్' తేజం

- కర్నూలులో ఏర్పాటైన ఏపీఈఆర్‌సీ కార్యాలయం
- నేడు భవనాన్ని ప్రారంభించనున్న ఛైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి
- జూన్ 2 నుంచి అందనున్న సేవలు


ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఏపీఈఆర్‌సీ భవనం

కర్నూలు(అగ్రికల్చర్): ఇప్పటి వరకు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యాలయం రాయలసీమలోని కర్నూలుకు వచ్చేసింది. జూన్ 2 నుంచి సేవలు అందించనుంది. సొంతభవనంతో సహా కర్నూలులో ఏపీఈఆర్‌సీ రాష్ట్రస్థాయి ప్రధాన కార్యాలయం ఏర్పాటైంది. విద్యుత్ వ్యాపారం చేయడానికి, అమ్మడానికి ఏపీఈఆర్‌సీ నుంచి లైసెన్స్ తప్పనిసరి. విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితోనే టారిఫ్‌లు నిర్ణయిస్తారు. విద్యుత్ చార్జీలు పెంచడానికి, తగ్గించడానికి కూడా నియంత్రణ మండలి అనుమతి అవసరం. విద్యుత్ శాఖకు ఏపీఈఆర్‌సీ కోర్టు వంటిది. దీని అనుమతితోనే ఏ విషయంలోనైనా ముందుకు సాగాల్సి ఉంది. ఇటువంటి కీలకమైన ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కర్నూలులో ఏర్పాటు కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతోనే ఇది సాధ్యమైంది. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి భవన సముదాయాన్ని ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి గురువారం ఉదయం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో రాజకీయాలతో సంబంధం లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చర్యలు చేపట్టింది. కర్నూలు శివారులోని 220 కేవీ కార్బైడ్ సబ్ స్టేషన్‌కు చెందిన 2 ఎకరాల స్థలంలో 2023 జూన్‌లో ఏపీఈఆర్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోపే భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం కావడం విశేషం. భవన నిర్మాణ పనుల పురోగతిని ఛైర్మన్ నాగార్జునరెడ్డి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ... సలహాలు, సూచనలు ఇచ్చారు. ఛైర్మన్ నాగార్జునరెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎం సంతోష్‌రావు తీసుకున్న చొరవతో ఏడాదిలోపే పనులు పూర్తి కావడం, ప్రారంభోత్సవం కూడా చేపడుతుండటం విశేషం. రూ.23 కోట్లతో భవనాన్ని సర్వాంగసుందరంగా నిర్మించారు. ఇప్పటి వరకు ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. హైదరాబాద్‌లో ఉన్న ఈ కార్యాలయం కర్నూలులో ఏర్పాటు కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి భవనం ముగింపు పనులను ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు, ఏపీఈఆర్‌సీ టెక్నికల్ మెంబరు ఠాంగింగ్, ఫైనాన్స్ మెంబరు వెంకటరామారెడ్డి పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి కూడ పరిశీలించారు. గురువారం ఏపీఈఆర్‌సీ భవనాన్ని ప్రారంభిస్తుండగా... జూన్ 2 నుంచి కర్నూలు కేంద్రంగా ఈ కార్యాలయం పని చేస్తుంది. 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీఈఆర్‌సీ భవనం, 5,000 అడుగుల విస్తీర్ణంలో గెస్ట్‌హౌస్ నిర్మించారు.

ఘనంగా ప్రసాదం పంపిణీ



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి, మట్టి పాత్రల్లో ప్రసాదాన్ని తీసుకొస్తున్న దృశ్యం

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసులో భాగంగా బుధవారం సఫ్‌రాలుట్‌న (ప్రసాదం పంపిణీ) కార్యక్రమం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఘనంగా జరిగింది. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చీష్తీ ఇంట్లో మట్టి కుండల్లో ప్రత్యేంగా తయారు చేసిన తీపి పదర్థాన్ని డప్పువాయిద్యాలు, బ్యాండుమేళాల మధ్య, ధర్మకర్త ఇంటి నుంచి మట్టి పత్రాల్లో దర్గాకు తీసుకొచ్చారు. ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనల అనంతరం ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ ప్రసాదాన్ని ముగ్గురు భక్తులకు పంపిణీ చేశారు. ప్రసాదాన్ని పొలంలో పాతితే పంట బాగపండుతుందని, రోగం ఉన్నవారు తింటే స్వస్థత చేకూరుతుందని భక్తుల నమ్మకం. దీనిని మట్టి పాత్రల్లోనే తీసుకోని పోవడం ఇక్కడ భక్తుల ఆచారం. ప్రసాదం భక్తులు పోటీపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి అల్లీపీరా స్వాముల ఉరుసు


అల్లీపీరస్వాముల సమాధులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరా స్వాముల ఉరుసు గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా బుధవారం దర్గా ట్రస్టీ ప్రెసిడెంట్ గురు గాజీహుసేన్‌పీరా స్వాములు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఉరుసు మహోత్సవాలు ఉంటాయని, నేడు గంధం, రేపు ఉరుసు ఉంటుందని చెప్పారు. ఈ మహోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. దాదాపు లక్షకు పైగా భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో తగిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ చేపట్టనున్నారు.

రూ.21లక్షల విలువ చేసే 130 సెల్‌ఫోన్లు స్వాధీనం


విలేకరుల సమావేశంలో నిందితున్ని, రికవరీ చేసిన సెల్‌ఫోన్లు, నగదు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

డోన్ టౌన్: పట్టణంలోని చిగురమానుపేటలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో రూ.21 లక్షల విలువ చేసే 130 సెల్ ఫోన్లు, రూ.1,48,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్‌ని దృష్టిలో పెట్టుకొని కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. పట్టణంలో సమస్యాత్మకమైన చిగురమానుపేటలో పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, అస్రత్‌బాషా, పట్టణ, రూరల్ ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో పాటు జలదుర్గం ఎస్ఐ విజయ్‌కుమార్‌లు మూడు పోలీసు స్టేషన్ల సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారన్నారు. ఇందులో భాగంగా కాలనీకి చెందిన ఎరుకలి రవి అలియాస్ పిలక రవి ఇంట్లో తనిఖీలు చేస్తుండగా ఒక లగేజ్ బ్యాగ్‌లో దొంగలించుకొచ్చిన 130 సెల్‌ఫోన్లు, రూ.1,48,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రవిని అదుపులోకి తీసుకొని విచారించగా అతని సమీప బంధువులు ఎరుకలి నవాగ్ మరియు ఎరుకలి పవన్‌లు తమిళనాడు రాష్ట్రంకు వెళ్ళి అక్కడ రద్దీగా ఉన్న ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగలించేవారన్నారు. వాటిని రవికి ఇవ్వగా హైదరాబాద్‌కు తీసుకెళ్ళి మహమ్మద్ ఖాజా నిజాముద్దీన్ అలియాస్ ఖైజర్‌కు ఒట్టుగా అమ్ముతున్నట్లు వెల్లడైందన్నారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.21 లక్షలు ఉంటుందన్నారు. పైన తెలిపిన ముద్దాయిలు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇద్దరు మహిళల మృతికి కారణమైన ఆటోడ్రైవర్ అరెస్ట్

కర్నూలు : గార్గేయపురం గ్రామ పొలిమేరలోని నగర వనం చెరువులో ఇద్దరు మహిళల మృతికి కారణమైన ఆటోడ్రైవర్ ఎస్.మహబూబ్ బాషాను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. నగర వనంలోని చెరువులో మహిళా మృతదేహాలు నీటిపై తేలాడుతున్నట్లు ఈనెల 19వ తేదీ గార్గేయపురం వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు డీఐజీ విజయరావు, ఎస్పీ కృష్ణకాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీఎస్పీ విజయశేఖర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. వారి ఆదేశాల మేరకు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి పక్కా సమాచారంతో ఆటోడ్రైవర్ మహబూబ్ బాషా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేసి జైలుకు పంపారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అరుణ, జానకి కర్నూలులోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా వ్యభిచార వృత్తిలో ఉంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో కర్నూలు నగరానికి చెందిన ఆటో డ్రైవర్ మహబూబ్ బాషాకు జానకితో పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత వారి మధ్య మనస్పర్ధలు ఏర్పడి వేరే వ్యక్తుల చేత ఆటోడ్రైవర్‌ను కొట్టించిన సంఘటనను మనసులో పెట్టుకుని కక్ష పెంచుకున్నాడు. జానకిపై ప్రతీకారం తీర్చుకోవాలని అవకాశం కోసం ఎదురుచూస్తున్న మహబూబ్ బాషా ఈనెల 18వ తేదీన జానకి, అరుణలను ఆటోలో ఎక్కించుకుని గార్గేయపురం శివారులోని నగరవనం చెరువు వద్దకు చేరుకున్నారు. వారు బట్టలు ఉతుక్కుంటుండగా జానకిని వెనకవైపు నుంచి మహబూబ్ బాషా నీటిలోకి తోసేశాడు. ఈ క్రమంలో ముద్దాయి కూడా నీటిలో పడిపోగా గట్టున ఉన్న అరుణ అతనిని కాపాడే క్రమంలో నీటిలో పడిపోయింది. అయితే వారిని వదిలేసి ఆటోడ్రైవర్ గట్టుకు చేరుకుని ఆ రోజు నుంచి కనపడకుండా తిరుగుతుండటంతో అనుమానం వచ్చి పోలీసులు అతనిపై నిఘా వేసి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతనిని జైలుకు పంపినట్లు తాలూకా సీఐ శ్రీధర్ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందిద్దాం


శిక్షణ ముగించుకున్న ఏహెచ్‌ఏలతో పశువైద్య అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): చిన్న వయస్సులోనే ఉద్యోగాలు సంపాదించుకున్నారని, నోరు లేని మూగ జీవాలకు మెరుగైన వైద్యసేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని నూతన అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల (ఏహెచ్ఏ)కు కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రసన్నబాబు సూచించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏహెచ్‌ఏలుగా ఎంపికైన కర్నూలు డివిజన్‌లోని 55 మందికి కర్నూలు బహుళార్ధ పశువైద్యశాలలోని ట్రైనింగ్ సెంటర్‌లో 45 రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణా కాలంలో పలువురు పశువైద్య అధికారులు ఏహెచ్‌ఏల విధులు, బాధ్యతలు, పశువైద్యానికి సంబంధించిన సాంకేతిక సలహాలు, తదితరాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కర్నూలు డివిజన్ డీడీ దుర్గా ప్రసన్న బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యానికి తావు ఇవ్వరాదన్నారు. ఉద్యోగ ధర్మాన్ని జవాబుదారీతనంతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బహుళార్ధ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్, విశ్రాంత జేడీ డాక్టర్ రామచంద్రయ్య, ట్రైనింగ్ సెంటర్ ఏడీ సుధాకర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై సెబ్ కొరడా

- 13 ట్రాక్టర్లు, 56 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లతో సెబ్ అధికారులు

కర్నూలు: ఇసుక అక్రమ రవాణాపై సెబ్ అధికారులు కొరడా ఝుళిపించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై నిఘా వేసి మొత్తం 13 ట్రాక్టర్లతో పాటు 56 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేశారు. సెబ్, డీటీఎఫ్, ఇంటెలిజెన్స్ విభాగం సిబ్బంది బృందాలుగా ఏర్పడి కర్నూలు సెబ్ స్టేషన్ పరిధిలో 9 ట్రాక్టర్లతో పాటు 36 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి రూ.90 వేల అపరాధ రుసుం విధించారు. నిడ్జూరు గ్రామానికి చెందిన షేక్ సుభాన్ బాషా, మునగాలపాడుకు చెందిన వడ్డె వెంకటేష్, కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామానికి చెందిన బోయ గడ్డం నాయుడు, కర్నూలుకు చెందిన శ్రీకృష్ణ, కురువ భీమలింగడు, ఎం.నాగన్న, నరేష్, బోయ నడిపి రంగస్వామిలకు చెందిన ట్రాక్టర్లతో పాటు మునగాలపాడు, జొహరాపురం ప్రాంతాల్లో అనుమతి లేకుండా హంద్రీ, తుంగభద్ర నదుల నుంచి ఇసుకను తరలించి ఒక్కో ట్రాక్టర్ రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం అందుకున్నారు. ఈ మేరకు కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే ఆదోనిలో రెండు ట్రాక్టర్లతో పాటు 10 మెట్రిక్ టన్నుల ఇసుక, పత్తికొండలో రెండు ట్రాక్టర్లతో పాటు 10 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే 8008828467, 9000067587, 8328052562 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.